బంగారు భవితకు భరోసా!

- భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు శిక్షణ
- 21 రకాల చిన్నారులకు భవితలో సకల సేవలు
- శిక్షణతో వికసిస్తున్న చిన్నారి మనస్సులు



స్పీచ్‌థెరపీ చేయిస్తున్న స్పెషల్ ఎడ్యుకేటర్

రేపల్లె రూరల్: శారీరకంగా, మానసికంగా ఎదుగుదల సరిగా లేక ఇబ్బందులు పడుతున్న చిన్నారుల భవిష్యత్ తల్లిదండ్రులకు ఒక సవాలుగా నిలుస్తోంది. ఆ చిన్నారులను వైద్యశాలల చుట్టూ తిప్పుతూ ఆర్థికంగా, మానసికంగా సైతం కుంగిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో భవిత కేంద్రాలతో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల భవితవ్యానికి భరోసా కలుగుతోంది.

భవిత కేంద్రాల ద్వారా స్వాంతన..

బాపట్ల జిల్లాలో ప్రస్తుతం 25 భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా గత సంవత్సరం 2,608 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు నిత్యం మానసిక పరివర్తనతో కూడిన విద్యను అవలంభిస్తూ స్వాంతన పొందారు. అయితే ఈ సంవత్సరం సర్వశిక్ష ద్వారా నిర్వహిస్తున్న సర్వేలో జిల్లావ్యాప్తంగా ప్రస్తుతానికి 3,309 మందికిపైగా చిన్నారులు ఉండటాన్ని గుర్తించారు. రేపల్లె పట్టణంలోని భవిత కేంద్రంలో పలువురు చిన్నారులకు సహిత విద్యనందించడమే కాకుండా వారి వైకల్యాన్ని తగ్గించేందుకు, ఇతర చిన్నారులతో కలిసేందుకు భవిత సిబ్బంది కృషి చేస్తున్నారు.

సహిత విద్య విభాగం ద్వారా శిక్షణ..

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు వైకల్యం శాతం పెరగకుండా, ఉన్న వైకల్యాన్ని తగ్గించటమే లక్ష్యంగా ఏర్పడిన సహిత విద్య విభాగం ద్వారా భవిత కేంద్రాలు అనేక రకాలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

- ఈ కేంద్రాలలో ఇద్దరు ప్రత్యేక ఉపాధ్యాయులతో పాటు ఫిజియోథెరపిస్ట్, స్పీచ్ థెరపిస్ట్, సైకాలజిస్ట్, ఒక సీజీవీ చిన్నారులకు సేవలు అందిస్తుంటారు.
- స్పెషల్ ఎడ్యుకేటర్‌లు బొమ్మలు, ప్లకార్డులు, పజిల్స్ చూపుతూ మానసిక పరివర్తనతో కూడిన విద్యలో శిక్షణ అందిస్తుంటారు.
- ఒక్కొక్కరికి కొంత సమయాన్ని కేటాయిస్తూ వారి మానసిక స్థితికి అనుగుణంగా అర్థమయ్యే విధంగా శిక్షణనిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. మాటలు, ఫిజియోథెరపీ, బిహేవియర్ మాడిఫికేషన్స్ థెరపీ తదితర సేవలు అందిస్తుంటారు.
- భవిత కేంద్రాలకు వచ్చేవరకు వారి పనులు చేసుకోలేని స్థితిలో, కనీసం ఎదుటి వారిని అర్థం చేసుకోలేని పరిస్థితి నుంచి తమ పనులు తామే చేసుకునే స్థాయికి చేరుకుంటున్నారు.
- ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో సాంకేతికత ఎంతో ముఖ్యమైనది. దీంతో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ట్యాబ్‌లు, కంప్యూటర్‌ను ఉపయోగించే విధంగా భవిత స్కూల్స్ నిర్వాహకులు శిక్షణనిస్తూ చైతన్యపరుస్తున్నారు.



రేపల్లె భవిత కేంద్రంలో ప్లకార్డులు, ఆట వస్తువులతో విద్యాబుద్ధులు నేర్పుతున్న స్పెషల్ ఎడ్యుకేటర్ అనురాధ

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు వీరే...

పూర్తి అంధత్వం, తక్కువ దృష్టి, వినికిడి లోపం, భాషణం లోపం, చలన వైకల్యం, మానసిక వైకల్యం, నిర్దిష్ట అభ్యసనా వైకల్యం, మెదడు పక్షవాతం, ఆటిజం, బహుళ వైకల్యం, కుష్ఠువ్యాధి గ్రస్తులు, మరుగుజ్జుతనం, దీర్ఘకాలిక నరాల సమస్య, కండరాల క్షీణత, బహుళ నాడీ వ్యవస్థలో బలహీనత, మానసిక రుగ్మత, యాసిడ్ దాడి బాధితులు, తలసేమియా, హిమోఫీలియా, కొడవలి కణ రక్తహీనత, మెదడు నుంచి నరాల బలహీనత వంటి వారందరూ ప్రత్యేక చిన్నారులుగా గుర్తింపబడ్డారు.



చిన్నారికి ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న ఫిజియోథెరఫిస్ట్ శ్రీధర్

సాధారణ పిల్లలతో కలిపే బోధన..



జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను గుర్తించే ప్రక్రియ నిర్వహిస్తున్నాం. ఎవరైనా ఇటువంటి చిన్నారులు ఉంటే తల్లిదండ్రులు సమాచారం అందించి చిన్నారుల అభ్యున్నతికి భాగస్వాములు కావాలి. గతంలో ఈ చిన్నారులకు ప్రత్యేకంగా పాఠశాలలు ఉండేవి. ప్రస్తుతం సాధారణ పిల్లలతో కలిసి చదువుకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలోనే భవిత కేంద్రాలను నెలకొల్పి అక్కడే ప్రత్యేక, సాధారణ ఉపాధ్యాయులచే బోధన అందిస్తున్నాం. ఇదే సహిత విద్య ప్రధాన లక్ష్యం.

– మట్టా జ్యోత్స్న, సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్, బాపట్ల

మానసిక, శారీరక ఎదుగుదలకు..

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదల, అభ్యున్నతికి ప్రత్యేక శిక్షణనిస్తున్నాం. ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నాం. భవిత కేంద్రానికి వచ్చిన సమయానికి, ప్రస్తుతం పాఠశాలలో అభ్యసిస్తున్న సమయానికి చిన్నారుల ప్రవర్తనలో చాలా మార్పు వచ్చింది. చిన్నారులు సాధారణ విద్యార్థులతో మాట్లాడటం, చదవటం చేస్తున్నారు. వీరి ప్రవర్తనలో మార్పు రావటం ఆనందంగా ఉంది. ఈ చిన్నారులను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నాం. తల్లిదండ్రులను చైతన్యపరిచి చిన్నారులు కేంద్రానికి వచ్చేవిధంగా కృషిచేస్తున్నాం.

– అనురాధ, స్పెషల్ ఎడ్యుకేటర్, రేపల్లె

మా పాప పరిస్థితి మెరుగైంది..



భవిత సెంటరులో మా పాపను చేర్పినప్పటికీ, నేటికీ చాలా మార్పు వచ్చింది. గతంలో మాట్లాడటం, నడవటంలో మందగమనం ఉండేది. నేడు మాపాప మాట్లాడుతోంది. స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీలతో కేవలం ఆరు నెలల కాలంలో ఎంతో మెరుగైంది. నన్ను అమ్మా అంటూ పిలవటం, నడవటంతో పాటు కంటితో చూసి చేతితో చేసే పనులను సైతం తానే సొంతంగా చేసుకుంటోంది. – దేవిశ్రీ, ప్రత్యేకావసరాల చిన్నారి తల్లి

ఎస్వీఆర్‌ఎంలో కృత్రిమ మేధపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న డాక్టర్ సూర్యకామేశ్వరి, ప్రిన్సిపాల్ తదితరులు

నగరం: కృత్రిమ మేధ సాయంతో యంత్రాలు మానవులు చేసే ప్రతి పనిని చేయగలుగుతున్నాయని ఏఎన్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సూర్యకామేశ్వరి చెప్పారు. స్థానిక ఎస్వీఆర్‌ఎం కళాశాలలో శనివారం కంప్యూటర్ సైన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ), అప్లికేషన్స్‌పై జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా సూర్యకామేశ్వరి మాట్లాడుతూ ఏఐ అన్ని రంగాలలోను మానవాళి జీవనానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మనిషి చేసే ఎన్నో పనులను నేడు ఏఐ చేయగలుగుతుందన్నారు. ఏఐ సాంకేతికతను వినియోగించుకుని మానవాళి మనుగడకు ఉపయోగపడే అంశాలపై పరిశోధనలు చేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పి.వెంకటనారయణ, కంప్యూటర్ సైన్స్ హెచ్ఓడీ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు



రిమాండ్ ఖైదీలకు సూచనలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

రేపల్లెరూరల్: క్షణికావేశంలో చేసే తప్పిదాలతో జీవితాన్ని కోల్పోవాల్సిన పరిస్థితులు నెలకొంటాయని రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలకు శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడారు. ఖైదీలు శాంతియుత మార్గాన్ని ఎంచుకుని సత్ప్రవర్తనతో నడుచుకోవాలని చెప్పారు. పగలు ప్రతీకారాలను, రాగద్వేషాలను వీడి శాంతికాముకులుగా జీవించాలని సూచించారు. అనంతరం జైలులో ఖైదీలకు అందుతున్న వసతులపై ఆరాతీశారు. వివిధ రకాల చట్టాలను వివరించారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జీ రూపశ్రీ, సబ్ జైల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

హేమ విఠలేశ్వరునికి లక్ష బిల్వార్చన



భట్టిప్రోలు: భట్టిప్రోలులో కొలువైన బాలా త్రిపుర సుందరీ దేవి సమేత హేమ విఠలేశ్వర స్వామి దేవాలయంలో శనివారం 41వ లక్ష బిల్వార్చన అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి ప్రభాత సంకీర్తన, మారేడు దళాలతో భజన సమాజాల సంకీర్తన, అనంతరం విఘ్నేశ్వర పూజ, గోపూజ జరిగాయి. ధర్మకర్తల సహకారంతో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు శ్రాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నందీశ్వర స్వామి వార్లకు పూజలు జరిగాయి. రాత్రి అఖండ జ్యోతి, దీప ప్రదర్శన, జ్యోతిర్లింగార్చన, మంత్రపుష్పం, సంకీర్తనలు జరిగిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. పూజా కార్యక్రమాలలో పలువురు దంపతులు పాల్గొన్నారు. మురికిపూడి దుర్గాప్రసాద్ శాస్త్రయుక్తంగా నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం సమారాధన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఏఓ విజయ్‌బాబు

రేపల్లె రూరల్: రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ,2024–25 ధాన్యం కొనుగోలు వాల్‌పోస్టర్‌లను విడుదల చేసి అనంతరం మాట్లాడారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని మాత్రమే రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తామన్నారు. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ధాన్యాన్ని సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఈ–పంట నమోదు చేసుకుని, ఈకేవైసీ పూర్తి చేసుకున్న రైతుల వద్ద నుంచే ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి విజయ్‌బాబు మాట్లాడుతూ సాధారణ రకం(కామన్) క్వింటా రూ.2300, 75 కిలోల బస్తాకు రూ.1725, 40 కిలోల బస్తాకు రూ.920 మద్దతు ధర లభిస్తుందన్నారు. గ్రేడ్–ఏ రకం క్వింటాకు రూ.2320, 75 కిలోల బస్తాకు రూ.1740, 40 కిలోలకు రూ.928 ధర లభిస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వీఆర్‌ఓలు, వీఏఏలు, సివిల్ సప్లయి టెక్నికల్ అసిస్టెంట్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు, అభ్యుదయ రైతులు, రైస్‌మిల్లర్‌లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సుశీల

వేమూరు: రైతులు పండించిన పంటను రైతు సేవా కేంద్రాల్లో విక్రయించుకోవాలని తహసీల్దార్ సుశీల అన్నారు. వేమూరు మండల కేంద్రంలోని రైతులు, రైస్ మిల్లు యాజమాన్యంతో ఆమె శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వరిని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తోందని, రైతులందరూ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని సూచించారు. వీఆర్వోలు దితేంద్ర, స్వరాజ్యం, ఏఓ సునీత, తదితరులు పాల్గొన్నారు.

చుండూరులో...

చుండూరు(వేమూరు): వరి సాగు చేసిన ప్రతి రైతు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకోవచ్చని చుండూరు తహసీల్దార్ నాగరాజు అన్నారు. చుండూరు మండల కేంద్రంలోని రైతులు, రైతు సేవ కేంద్రం సిబ్బందితో శనివారం తహసీల్దార్ సమావేశమయ్యారు. ఏఓ ఆదాంబాబు, డీటీ శ్రీనివాసరావు, వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

అమర్తలూరులో...

అమర్తలూరు(వేమూరు): మండలంలో ధాన్యం కొనుగోళ్లకు మూడు రైస్ మిల్లును కేటాయించడం జరిగిందని మండల వ్యవసాయాధికారి ఉయ్యూరి లోకేశ్వరి తెలిపారు. అమర్తలూరులోని రైతు సేవా కేంద్రంలో శనివారం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో సుధా రైస్‌మిల్లు, ఇంటూరులో వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్, కూచిపూడిలో సాయి భాస్కర్ రైస్ మిల్లులు ఎంపిక చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా అమర్తలూరు క్లస్టర్‌లో అమర్తలూరు 1,2, రైతు సేవా కేంద్రం, పాంచాళవరం, తురిమెళ్ల, రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. తహసీల్దార్ నెహ్రూ, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్‌లు అందజేత



సర్టిఫికెట్‌లు అందుకున్న ఎన్‌సీసీ విద్యార్థులు

రేపల్లెరూరల్: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని ఎన్‌సీసీ 22ఏ ఆంధ్ర బెటాలియన్ నాయన్ శుబేదార్ జ్యోతిసింగ్ అన్నారు. పట్టణంలోని మోంట్‌ఫోర్ట్ స్కూలులో ఎన్‌సీసీలో శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ 2022–24 బ్యాచ్ విద్యార్థులకు స్థానిక స్కూల్ ఆవరణలో శనివారం నిర్వహించిన సర్టిఫికెట్‌ల అందజేత కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్‌సీసీ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడేందుకు అవకాశం ఉంటుందన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించటంతో పాటు సాయం అందించే గుణం ఏర్పడుతుందని సూచించారు. అంతేకాకుండా భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలకు ఎన్‌సీసీ కొంతవరకు దోహదం చేస్తుందని చెప్పారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేశారు. ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి, హవల్దార్ విజయ్‌పాల్ సింగ్, ఎన్‌సీసీ ఉపాధ్యాయులు బాబావలి ఖాన్, హరికృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

నల్లమోతువారిపాలెం(కర్లపాలెం): గిరిజన కుటుంబాల వారు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని మండల అభివృద్ధి అధికారి అద్దూరి శ్రీనివాసరావు చెపపారు. శనివారం నల్లమోతువారిపాలెం పంచాయతీలోని వెన్నెలకంటి నగర్ ఎస్టీ కాలనీలో పర్యటించిన ఎంపీడీఓ ప్రజలతో మాట్లాడారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఉపాధిహామీ జాబ్ కార్డులు లేని గిరిజనులు దరఖాస్తు చేసుకుని వాటిని పొందటం ద్వారా అర్హతలను బట్టి ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని చెప్పారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన రహదారుల నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం కస్తూరిభా నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. చిన్నారులకు పౌష్టికాహారం, విద్యార్థులకు మధ్యాహ్నం సక్రమంగా అందజేయాలని సూచించారు. నల్లమోతువారిపాలెంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది క్యాన్సర్ వ్యాధిని గుర్తించేందుకు చేస్తున్న సర్వేను ఆయన పర్యవేక్షించారు.

క్రీడాపోటీల్లో గురుకుల విద్యార్థుల విజయకేతనం



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

చుండూరు(వేమూరు): జోనల్ స్థాయిలో క్రీడా పోటీల్లో గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు బహుతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. చుండూరు మండల కేంద్రంలో అంబేడ్కర్ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థులు తిరుపతి జిల్లా కోటలో జరిగిన 6వ జోనల్ స్థాయి క్రీడలలో పాల్గొని పలు పోటీల్లో విజయం సాధించినట్లు ఆయన తెలిపారు. చిరంజీవి, ఎం.అజయ్ చెస్‌లో ప్రథమ స్థానం, టి.యశ్వంత్, ఎం.అజయ్‌లు క్యారమ్స్‌లో ద్వితీయ స్థానం, జి.లోహిత్ డిస్క్ త్రోలో తృతీయ స్థానం సాధించారన్నారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, పీడీ కె.రమేష్‌కుమార్, వ్యాయమ ఉపాధ్యాయులు డి.వీరయ్య, వైస్ ప్రిన్సిపాల్ కె.బాబురావు తదితరులు అభినందించారు.

క్లుప్తంగా

శబరిమలకు తరలిన అయ్యప్పలు



ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరానికి చెందిన అయ్యప్పస్వామి మాలధారులు శనివారం స్థానిక శివాలయం వద్ద నుంచి భారీ ఎత్తున ఇరుముడులు కట్టుకుని శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మండలంలోని మాలధారణ చేసిన అయ్యప్ప భక్తులు ఆయా ఆలయాల ప్రాంగణంలో అయ్యప్ప స్వామిని భక్తి శ్రద్ధలతో కొలిచి కుటుంబ సభ్యుల సమక్షంలో ఇరుముడులు కట్టుకుని యాత్రలకు తరలివెళ్లారు. శబరిమలకు వెళుతున్న అయ్యప్ప స్వాములకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఐలవరంలో డోకుపర్తి రఘు, అందే మోహన్ గురుస్వాముల ఆధ్వర్యంలో మాలధారులు శబరిమలకు తరలి వెళ్లారు.

మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన



నగరం: బహిరంగ మలవిసర్జన వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఎంపీడీఓ బొర్రా శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని పెద్దవరంలో శనివారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన సభలో ఎంపీడీఓ పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ మరుగుదొడ్డిని నిర్మించుకోవాలన్నారు. స్వచ్ఛ భారత్ సిబ్బంది ప్రజలకు మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని కోరారు. తొలుత సచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో గ్రామ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి జి.గోపినాథ్, స్వచ్ఛ భారత్ కో–ఆర్డినేటర్ బి.భరత్ పాల్గొన్నారు.

సచివాలయ సేవలపై అవగాహన



ఐలవరం (భట్టిప్రోలు): ఐలవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా శనివారం స్థానిక సచివాలయాన్ని సందర్శించి, సచివాలయంలో అందేసేవలు, సిబ్బంది విధులు గురించి తెలుసుకున్నారు. పాఠశాలకు చెందిన 9, 10 తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిజమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ దిశ, నిర్దేశం ఈ ఫీల్డ్ ట్రిప్ నిర్వహించారు. సచివాలయం ద్వారా ప్రజల సమస్యలు ఏవిధంగా పరిష్కరిస్తారు, ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఎలా అందిస్తారనే విషయంపై సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఎం.కోటేశ్వరరావు విద్యార్థులకు వివరించారు. సమాజంలో జరుగుతున్న అభివృద్ధిపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోందని హెచ్‌ఎం ఎం.మోహన్‌రావు తెలిపారు. ఒకేషనల్ ఉపాధ్యాయురాలు వి.తిరుమల దేవి, ఉపాధ్యాయులు పి.ఏకాంబరాచారి, కె.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సూర్యలంక బీచ్‌లో 'స్వచ్ఛత'



బాపట్ల: బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో సూర్యలంక తీరంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. స్వచ్ఛత కార్యక్రమాన్ని కళాశాల డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి ప్రారంభించారు. మొత్తం 40మంది విద్యార్థులు ఈకార్యక్రమంలో పాల్గొని తీరంలో చెత్త తొలగించారు. ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించారు. చెత్త నిల్వ ఉన్న చోట వాతావరణం కలుషితమై యాత్రికులు అంటువ్యాధులకు గురయ్యే ప్రమాదముందని డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి తెలిపారు. కళాశాల ఎన్.సి.సి. అధికారి డాక్టర్ జి.వినయ్ కుమార్, మెరైన్ పోలీసులు పాల్గొన్నారు.

రూల్స్ అందరూ పాటించాల్సిందే

ఆటో డ్రైవర్లకు సీఐ కౌన్సెలింగ్

తెనాలిరూరల్: తెనాలి పట్టణం నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఆటో డ్రైవర్లకు త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్ బాబు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో శనివారం మధ్యాహ్నం ఆటో డ్రైవర్లను పలిపించి ట్రాఫిక్ ఎస్ఐ రాజ్యలక్ష్మితో కలిసి కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, యూనిఫాం ధరించాలని చెప్పారు. అడ్డదిడ్డంగా రాకపోకలు సాగించడం, నిబంధనలు పాటించకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు.

సత్యసాయిబాబా జయంతి వేడుకలు

భట్టిప్రోలు: లవ్ ఆల్ – సర్వ్ ఆల్.. హెల్ప్ ఎవర్–హర్ట్ నెవర్ అనే నినాదాలను ప్రత్యక్షంగా ఆచరింపచేస్తూ అవతార లక్ష్యాన్ని తెలియ చేసిన అవతార పురుషుడు సత్యసాయిబాబా అని బాల వికాస్ బాపట్ల జిల్లా కన్వీనర్ వేములపల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. భట్టిప్రోలులో శ్రీ సత్య సాయి భజన మండలి ఆధ్వర్యంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. భట్టిప్రోలు, వేమవరం భజన మండలి కన్వీనర్లు మానేపల్లి సుబ్బారావు, దీవి శివరామకృష్ణ, బాలవికాస్ గురువులు తూనుగుంట్ల నాగమణి, మద్దుల నళిని, మానేపల్లి శశికళ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యాలయానికి కంప్యూటర్ బహూకరణ

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) కార్యాలయానికి విశ్రాంత ఉపాధ్యాయులు కూచిమంచి శివరామకృష్ణ శనివారం కంప్యూటర్ బహూకరించారు. ఈ సందర్భంగా స్థానిక యూటీఎఫ్ శాఖ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శిగా వి.సురేష్‌కుమార్, అధ్యక్షుడు ఎండీ ఆల్తాఫ్, గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావులకు కంప్యూటర్‌ను అందచేశారు. శివరామకృష్ణను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 24న బాపట్ల సూర్యకాశీ ఫంక్షన్ ప్లాజాలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

నేడు కార్తిక వన సమారాధన

భట్టిప్రోలు: మార్కండేయ పద్మశాలీయ బహుత్తమ సేవా సంఘం భట్టిప్రోలు – అద్దేపల్లి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక టీఎంరావు హైస్కూల్‌లో కార్తిక వనసమారాధన జరుగుతుందని నిర్వాహకులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా జనగనున్న సత్యన్నారాయణస్వామి వ్రతంలో పలువురు దంపతులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఘనంగా స్వరాజ్యాశ్రమం వార్షికోత్సవం

రేపల్లె రూరల్: మండలంలోని పేటేరు బ్రహ్మశ్రీ జగద్గురు వేదాంత లక్ష్మణాచార్యుల స్వరాజ్యాశ్రమం 18వ వార్షికోత్సవం శనివారం ఆశ్రమంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ ప్రణవానంద స్వామి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యులు పీవీ బ్రహ్మజీ, చేనేత సంఘం నాయకుడు పట్టెం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం పై నుంచి జారిపడ్డ జూనియర్ లైన్‌మెన్

తీవ్రగాయాలతో ఆస్పత్రికి తరలింపు

భట్టిప్రోలు: మండల పరిధిలోని వెల్లటూరులో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న గుంటి పైడిరాజు ప్రమాదవశాత్తు శుక్రవారం విద్యుత్ స్తంభం పై నుంచి కింద పడ్డాడు. ప్రమాదంలో పైడిరాజు కాలుకు ఫ్యాక్చర్ అయింది. విద్యుత్ షాక్ తగలేదని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఘటన జరిగిన వెంటనే స్థానిక పీహెచ్‌సీకి పైడిరాజును తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుంటూరులోని వైద్యశాలకు మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. పైడిరాజు కాలుకు శస్త్రచికిత్స చేయాల్సి ఉందన్నారు.

బిర్సాముండాకు ఘననివాళి



కర్లపాలెం: స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన నాయకుడు బిర్సాముండా పోరాట పటిమ ఆదర్శవంతమైనదని ఎంపీడీఓ అద్దూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా 150వ జన్మదినం సందర్భంగా కర్లపాలెం ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ మనోరంజనిలు పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఇనకొల్లు పోలీస్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళపై మాజీ భర్త చాకుతో దాడి

తెనాలిరూరల్: మహిళపై మాజీ భర్త చాకుతో దాడి చేసి గాయపర్చిన ఘటన తెనాలి వైకుంఠపురం వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వైకుంఠపురానికి చెందిన బుర్రి సంధ్యకు 12 ఏళ్ల క్రితం ఇదే ప్రాంతంలోని పోతురాజు కాలనీకి చెందిన దమ్ము సామేలుతో వివాహమైంది. రెండేళ్ల నుంచి భర్తతో విడిపోయి ఉంటూ విడాకులు తీసుకుంది. శనివారం వైకుంఠపుర దేవస్థానం సమీపంలో తన బాబాయి పూల కొట్టు వద్ద కూర్చుని ఉన్న ఆమె వద్దకు మాజీ భర్త సామేలు వచ్చి మాట్లాడాలంటూ రమ్మన్నాడు. దాని ఆమె నిరాకరించడంతో బలవంతంగా కొంతదూరం లాక్కువెళ్లి తనతో పాటు తెచ్చుకున్న చాకుతో ఆమె వీపు భాగంలో దాడి చేసి గాయపర్చాడు. ఆమె కేకలు విన్న బాబాయి అక్కడి వారు రావడంతో నిందితుడు పరారయ్యాడు. క్షతగాత్రురాల్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.